# శబ్దానికీ శబ్దానికీ మధ్య . . .

ఆందోళన అనిశ్చిత స్థితి అంతటా వేలాడుతుంటుంది.
అందంగా అలంకరించుకున్న మొహం
అతుకుల బొంతయి తిరిగొస్తుంది.

శబ్దానికీ శబ్దానికీ మధ్య నిశ్శబ్దాల్ని
నిశ్శబ్దంలో నిక్షిప్తమయిన శబ్దాల్ని
నిమిష నిమిషానికీ కొల్చుకుంటూ పోతున్నా
హఠాత్తుగా
కాళ్లకింద భూమి కదులుతుంది.
కంటిముందే కసుక్కున కత్తి దిగుతుంది.
మీదనుండి వాహనమేదో దూసుకు పోతుంది
చుట్టూ మంటలు చుట్టు కుంటాయి
ఎలా తప్పించుకుంటావు?

రాక్షస బొగ్గుని పోతపోసినట్టుగా మానవరూపాలు
విరిగిపోయిన శిలావిగ్రహాల్లా వికృత రూపాలు
రక్తసిక్తమైన అడుగుజాడలు
కళేబరాల మీద కాసుల వేటలు
దారంతా కనిపిస్తూనే ఉంటాయి
ఎలా తట్టుకోగలవు?

ఎవరికి వారు ప్రకటించుకుంటే తప్ప
ఆచూకీలు ఆనవాళ్లు దొరకవెక్కడా
నీదేకాదు - నిన్ను లేకుండా చేసిన వాడిది కూడా.
రహస్య స్థావరంలో వాడెక్కడో

రక్తాన్నం తింటూ రంగుల తెరమీద
హాహాకారాల ఆర్తనాదాల నేపథ్య సంగీతాల మధ్య
సజీవ దహనాల్ని ఖననాల్ని
ప్రాణస్పర్శకు పాకులాడ్తున్న చిట్లిపోయిన రక్తనాళాల్ని
రసాస్వాదన చేస్తుంటాడు.
ఎలా పట్టుకోగలవు?

స్వప్నాలలో తేలిపోతున్న సింహాసనానికి
అదృశ్య హస్తాలేవో అస్పష్టంగా కనిపిస్తుంటాయి.
పూర్తయిన దర్యాప్తుల్ని పూర్తిగా తినేసిన చెదలు
ఆకలి తీరక – దర్యాప్తో దర్యాప్తో అని అరుస్తుంటాయి.
నిజానిజాలు సందేహాలు సందేహాలై వేధిస్తుంటాయి
ఏమి చేయగలవు?

దేనికైనా సిద్ధంగా ఉండు
నీతో నడుస్తున్న చావుకైనా తెలీదు
నిన్నెప్పుడు ఎలా కబళించాలోనని!